ఈనాడు
epaper.eenadu.net



సమావేశానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. చిత్రంలో ఎంపీలు బలరాంనాయక్, రఘురాంరెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘునందన్‌రావు

# నలువైపులా మెట్రో తెచ్చుకుందాం

- పార్లమెంట్ సమావేశాలకు ముందు రెండోదశపై ఎంపీలకు అవగాహన
- సీఎం సూచనతో మంత్రి కోమటిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహణ

ఈనాడు, హైదరాబాద్: మెట్రోరైలు రెండోదశ సాధనకు తెలంగాణ ఎంపీలకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ(హెచ్ఏఎంఎల్) ఆధ్వర్యంలో శనివారం పార్క్‌హయత్ హోటల్లో అవగాహన సదస్సు నిర్వహించింది. ముఖ్యఅతిథులుగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి కేంద్రం త్వరితగతిన అనుమతులు మంజూరు చేసేలా రాష్ట్రానికి చెందిన ఎంపీలు పార్టీలకతీతంగా కృషి చేయాలని మంత్రులు కోరారు. సమావేశానికి కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, బలరాంనాయక్, సురేశ్ షెట్కార్, అనిల్‌కుమార్ యాదవ్‌తోపాటు భాజపా ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు తదితరులు హాజరయ్యారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో రాష్ట్ర ఎంపీలకు మెట్రో రైలు ప్రతిపాదిత విస్తరణ కారిడార్లపై సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. మెట్రోరైలు రెండోదశను 2ఏ, 2బీగా రెండు భాగాలుగా ప్రతిపాదించినట్లు వివరించారు. 2ఏలో ఐదు కారిడార్లకు 76.4 కి.మీ.గాను రూ.24,269 కోట్ల వ్యయం అవుతుందని డీపీఆర్ రూపొందించి కేంద్రానికి నవంబరులో పంపినట్లు తెలిపారు. మెట్రో 2 బీ మూడు కారిడార్లలో 86.1 కి.మీ. ప్రతిపాదించి డీపీఆర్‌లను జూన్ 21న కేంద్రానికి సమర్పించినట్లు చెప్పారు. దీని వ్యయం రూ.19,579 కోట్లని వివరించారు.

## ఎంపీలతో వెళ్లి ప్రధానిని కలుస్తాం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

గత ప్రభుత్వం గొప్పలకు పోయి రెండోదశపై శ్రద్ధ పెట్టలేదు. మా ప్రభుత్వం వచ్చాక పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని 2ఏ, 2బీ కేటగిరీలుగా చేసి కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించింది. ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని ఎంపీలతో కలిసి ప్రధాని మోదీని కలవనున్నాం.